@netifocusnews @focustv www.netifocusnews.com
TS-18-0006625
FOCUS TELUGU TV
అనునిత్యం - ప్రజాపక్షం
# నేటి ఫోకస్ న్యూస్
అను నిత్యం...ప్రజా పక్షం...
COMPLIMENTARY COPY
తెలుగు డిజిటల్ దినపత్రిక
ఎడిటర్: యం.తరుణ్ || తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ప్రజల కోసం మా ఈ నేటి ఫోకస్ న్యూస్ తెలుగు డిజిటల్ దినపత్రిక || మంగళవారం 02, ఏప్రిల్ 2024 || పేజీలు: 04

## కేసీఆర్ ప్రజల్లోకి రాగానే
# నీళ్లొదిలారు

### ఇన్నాళ్లూ విమర్శలు చేస్తూ కాలయాపన చేశారు

- ముందే మేల్కొని వుంటే పంటలు కాపాడుకునే వారు
- నల్లగొండలో కెసిఆర్ పర్యటనల తరవాత ప్రజల్లో పునరాలోచన
- రేవంత్‌కు నల్లగొండ, ఖమ్మం నేతలతోనే ముప్పు
- పార్లమెంటరీ స్థాయి సమీక్షల్లో కెటిఆర్ విమర్శలు

**నేటి ఫోకస్ న్యూస్, నల్లగొండ-ఏప్రిల్1:**

కాళేశ్వరంపై అవాకులు చవాకులు పేలిన వారే.. కెసిఆర్ రైతల బాట పట్టడంతో నీళ్లు విడుదల చేశారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెం ట్ కేటీఆర్ అన్నారు. విమర్శిం చిన కాళేశ్వరమే నీళ్లు అందిస్తున్నదని అర్థం అయ్యిందన్నారు. ఈ పని ముందే చేసివుంటే రైతుల పంటలు కాపాడుకునే వారిమని అన్నారు. కాంగ్రెస్ పార్టీలోనే ఏక్‌నాథ్ షిండేలు ఉన్నారని.. నీ పక్కనే ఉన్న ఖమ్మం, నల్లగొండ బాంబుల తోనే నీకు ప్రమాదం పొంచి ఉందని రేవం త్ రెడ్డిని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హెచ్చరించారు. బీఆర్ఎస్ పార్టీతో రేవంత్‌కు ఎలాంటి ఇబ్బంది లేదని, ఈ ఐదేండ్లు ఆయనే పాలించి, హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. నల్లగొండలో ఏర్పాటు చేసిన నల్లగొండ పార్లమెంట్ విస్తృత స్థాయి సమావేశంలో కేటీఆర్ ప్రసంగించారు. మిగతా 2లో..



# కడియం రాజీనామా చేయాలి

- పార్లమెంట్ ఎన్నికల్లో కడియంకు గట్టి బుద్ధి చెప్పాలి
- విధాలుగా ఆదుకున్న పార్టీకి ద్రోహం చేసి వెళ్లాడు
- రేవంత్‌తోనే కండువా కప్పించుకోవడం సిగ్గుచేటు
- వరంగల్ పార్లమెంటరీ సమావేశంలో హరీష్ రావు

**నేటి ఫోకస్ న్యూస్, వరంగల్-ఏప్రిల్1:**

స్టేషన్ ఘన్‌పూర్ నుంచి అసెంబ్లీకి ఎన్నికైన కడియం శ్రీహరి తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలని బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, ఎమ్మెల్యే హరీశ్‌రావు డిమాండ్ చేశారు. పార్లమెంట్ ఎన్నికల్లో కడియం శ్రీహరికి గట్టిగా గుణపాఠం చెప్పాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. వరంగల్ పార్లమెంట్ విస్తృత స్థాయి సమావేశంలో హరీశ్‌రావు పాల్గొని ప్రసంగించారు. కడియం శ్రీహరి బీఆర్ఎస్‌ను వీడిన తర్వాత కార్య కర్తల్లో జోష్ ఎక్కువగా కనబడుతోంది. కసి మిగతా 2లో..



## కేసీఆర్‌వి దిగజారుడు
# రాజకీయాలు

### పదేళ్లు సీఎంగా చేసిన వ్యక్తి చేసే వ్యాఖ్యలేనా

- రాష్ట్రాన్ని సర్వనాశనం చేసి ఎలా మాట్లాడుతారు
- అప్పులకుప్పగా మార్చి అభివృద్ధి అంటే నమ్మాలా
- యాదాద్రి పవర్ ప్లాంట్ అంగీకారం కాకున్నా నిర్మాణమా
- కెసిఆర్ వ్యాఖ్యలపై మండిపడ్డ భట్టి విక్రమార్క



**నేటి ఫోకస్ న్యూస్, న్యూఢిల్లీ-ఏప్రిల్1:**

పదేళ్లు ముఖ్యమంత్రిగా చేసిన కెసిఆర్ అర్థంపర్థం లేకుండా దిగజారి మాట్లాడుతున్నారని సూర్యాపేటలో భారాస అధినేత కేసీఆర్ చేసిన వ్యాఖ్యలపై ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క విమర్శలు చేశారు. భారాస నేతలు భారీగా కాంగ్రెస్‌లో చేరుతుంటే ఆయన తట్టుకోలే పోతున్నారని ఎద్దేవా చేశారు. ఆయన మాటల్లో కొంచెమైనా వాస్తవాలు లేవన్నారు. దిల్లీలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో భట్టి మాట్లాడారు. పదేళ్లు సీఎంగా ఉన్న వ్యక్తి ఇంతలా దిగజారుతారా? అని ప్రశ్నించారు. కట్టుకథలు చెప్పి ప్రజలను మభ్యపెట్టాలని ప్రయత్నించారని మండిపడ్డారు. సమస్య వస్తే..కరెంట్ కోతలు అంటూ అబద్దాలు మాట్లాడారని చెప్పారు. బొగ్గు లభించే ప్రాంతానికి 350 కి.మీ. దూరంలో యాదాద్రి పవర్ ప్లాంట్ పెట్టారని దుయ్యబట్టారు. మిగతా 2లో..

## జగన్ అక్రమాస్తుల కేసు విచారణ
# జాప్యమెందుకు?

- సీబీఐను ప్రశ్నించిన సుప్రీంకోర్టు
- నాలుగు వారాలకు కేసు వాయిదా

**నేటి ఫోకస్ న్యూస్, న్యూఢిల్లీ-ఏప్రిల్1:**

జగన్ అక్రమాస్తుల కేసుల్లో విచారణ ఎందుకు ఆలస్యమవుతోందని సీబీఐని సుప్రీంకోర్టు ప్రశ్నించింది. దీనికి గల కారణాలు చెబుతూ నాలుగు వారాల్లో అఫిడవిట్ దాఖలు చేయాలని.. విచారణ వేగంగా పూర్తిచేయాలని జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ దీపాంకర్ దత్తా ధర్మాసనం ఆదేశించింది. డిశ్చార్జ్ పిటిషన్ల కారణంగా జాప్యమవుతోందని సీబీఐ తరఫున అదనపు సొలిసిటర్ జనరల్ ఎస్వీ రాజు కోర్టుకు తెలిపారు. రాజకీయ కారణాలతో ట్రయల్ ఆలస్యం కాకూడదని మిగతా 2లో..





## ఆ నాలుగు స్థానాలపై
# కాంగ్రెస్ కసరత్తు

- ఢిల్లీకి చేరుకున్న రేవంత్, భట్టి విక్రమార్క
- ఖమ్మం స్థానంపై పలువురు నేతల పట్టు

2



# నార్సింగ్‌లో రెచ్చిపోయిన పోకిరి

- అమ్మాయి పట్ల అసభ్య ప్రవర్తన
- నిలదీసిన పాపానికి తల్లిదండ్రులుపై తల్వార్లతో దాడి

2

## కేసీఆర్ పాలనలో ఇరిగేషన్ రంగం
# సర్వనాశనం

- పంటల బీమా అమలు చేయని ఏకైక రాష్ట్రం తెలంగాణ
- అబద్దాలతో మళ్లీ ప్రజల్లోకి వెళ్లిన కేసీఆర్
- కరువు వచ్చిందే బీఆర్ఎస్ పాలనలో:ఉత్తమ్



**నేటి ఫోకస్ న్యూస్, హైదరాబాద్-ఏప్రిల్1:**

కెసిఆర్ హయాంలో ఇరిగేషన్ రంగం సర్వనాశనం అయ్యిందని మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పై మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మండిపడ్డారు. ఇరిగేషన్ రంగంలో కేసీఆర్ చేసిన దోపిడీ దేశంలో ఎవరూ చేయలేదన్నారు. జనగామ, సూర్యపేట జిల్లాలో కేసీఆర్ పర్యటించి, కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శస్తూ కేసీఆర్ చేసిన వ్యాఖ్యలకు మంత్రి ఉత్తమ్ కౌంటర్ ఇచ్చారు. నిన్న కేసీఆర్ అన్ని అబద్దాలే మాట్లాడారని మండిపడ్డారు. గాంధీ భవన్‌లో ఉత్తమ్ మీడియాతో మాట్లాడుతూ.. ఉమ్మడి ఏపీ కంటే కేసీఆర్ హయాంలో తెలంగాణకు ఎక్కువ ద్రోహం జరిగిందన్నారు. పోలీస్ శాఖను మిగతా 2లో..

నేటి ఫోకస్ న్యూస్



## ఆ నాలుగు స్థానాలపై
# కాంగ్రెస్ కసరత్తు

**నేటి ఫోకస్ న్యూస్, న్యూఢిల్లీ-ఏప్రిల్1:**

తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ ప్రకటించాల్సిన నాలుగు ఎంపి స్థానాలు కాకరేపుతున్న వేళ సిఎం రేవంత్, డిప్యూటి సిఎం భట్టి విక్రమార్కలు ఢిల్లీ చేరుకున్నారు. సీట్లపై కాంగ్రెస్ అధిష్టనం కసరత్తు చేయనుంది. ఇకపోతే ఖమ్మం సీటులో పోటీ ఎక్కువగా ఉంది. ఇక్కడ మాకు కావల్సిందంటే.. మాకు కావాల్సిందేనంటూ బడా నేతలు పట్టుబడుతున్నాయి. ఈ క్రమంలోనే సందట్లో సడేమియాలాగా కొత్త వ్యక్తులు రంగంలోకి దిగుతున్నారు. తెలంగాణలో మిగిలిన 4 స్థానాలపై కాంగ్రెస్ కసరత్తు నిర్వహిస్తోంది. కాంగ్రెస్ సెంట్రల్ ఎలక్షన్ కమిటి సాయంత్రం భేటీ కానుంది. కరీంనగర్, వరంగల్, ఖమ్మం, హైదరాబాద్ స్థానాల్లో అభ్యర్థులను అధిష్టానం ఖరారు చేయనుంది. ఇప్పటికే మిగతా13 స్థానాలకు అభ్యర్థులను కాంగ్రెస్ నాయకత్వం ఖరారు చేసింది. ఖమ్మం సీటు కోసం ముగ్గురు మంత్రుల కుటుంబాలు పోటీ పడుతున్నాయి. పోటీ పడుతున్న వారిలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సోదరుడు ప్రసాద్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సతీమణి మల్లు నందిని, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కుటుంబం నుంచి తుమ్మల యుగంధర్ ఉన్నారు. ఈ ముగ్గురిని కాదని కాంగ్రెస్ నేత వంకాయలపాటి రాజేందప్రసాద్ కొత్తగా తెరపైకి వచ్చారు. మంత్రుల కుటుంబాలను కాదని వంకాయలపాటి రాజేందప్రసాద్ కు టికెట్ ఇచ్చే అవకాశం ఉంది. వరంగల్ స్థానం కోసం జరుగుతున్న సుదీర్ఘ కసరత్తు నిర్వహించనుంది. డి. సాంబయ్య, డా. పరమేశ్వర్, సిట్టింగ్ ఎంపీ పసునూరి దయాకర్ సహా పలువురు నేతలు టికెట్ ఆశిస్తున్నారు. తాజాగా కడియం శ్రీహరి, ఆయన కుమార్తె కావ్య కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. కడియం చేరిక నేపథ్యంలో వరంగల్ సీటుపై ఆసక్తి పెరిగింది. మాదిగ వర్గానికి ఈ సీటు ఇవ్వాలని మాదిగ జేఏసీ డిమాండ్ చేస్తోంది. కడియం కుటుంబాన్ని మాదిగ వర్గంగా పరిగణించకూడదని విజ్ఞప్తి చేశారు. కరీంనగర్ నుంచి ప్రవీణ్ రెడ్డి, సంతోష్ కుమార్ టికెట్ ఆశిస్తున్నారు. తీన్మార్ మల్లన్న పేరు తాజాగా తెరపైకి వచ్చింది. హుస్నాబాద్ స్థానాన్ని అసెంబ్లీ ఎన్నికల సమయంలో పొన్నం ప్రభాకర్ కోసం ప్రవీణ్ రెడ్డి వదులుకున్నారు. ముగ్గురిలో అధిష్టానం ఎవరి వైపు మొగ్గు చూపుతోందన్నది ఆసక్తికరంగా మారింది. అసదుద్దీన్ ఓవైసీ పోటీ చేస్తున్న హైదరాబాద్ స్థానం కోసం టెన్నిస్ స్టార్ సానియా మీర్జాతో పాటు షానవాజ్ తుబసం పేర్లను పరిశీలిస్తున్నారు. పెండింగ్ లో ఉన్న ఈ నాలుగు స్థానాలతో పాటు సికింద్రాబాద్ అభ్యర్థి మార్పుపై చర్చించే అవకాశం ఉంది. దానం నాగేందర్ పేరును అధిష్టానం ఇప్పటికే ప్రకటించింది. బీఆర్ఎస్ నుంచి గెలిచి ఎమ్మెల్యే పదవికి దానం నాగేందర్ రాజీనామా చేయలేదు. ఆయనను మార్చే పక్షంలో పరిశీలనలో బొంతు రామ్మోహన్ సహా మరికొందరి పేర్లున్నాయి.

# నార్సింగ్‌లో రెచ్చిపోయిన పోకిరి

**నేటి ఫోకస్ న్యూస్, రంగారెడ్డి-ఏప్రిల్1:**

నార్సింగిలో ఓ పోకిరి ముఠా రెచ్చిపోయింది. కిరాణా కొట్టుకు వెళ్లిన ఓ విద్యార్థిని పట్ల అసభ్యంగా ప్రవర్తించారు. సురేష్ అనే యువకుడు అమ్మాయి చేయి పట్టుకొని లాగి ఒంటిపై నీళ్లు పోశాడు. హోలీ పండుగ రోజు దొరకలేదంటూ వేధించి.. అమ్మాయిపై చేయి వేశాడు. దీంతో సురేష్ నుంచి తప్పించుకొని అమ్మాయి ఏడుస్తూ ఇంటికి వెళ్లి జరిగిన విషయాన్ని తల్లిదండ్రులకు చెప్పింది. తన కూతురికి జరిగిన అన్యాయాన్ని నిలదీయడానికి వెళ్లిన తల్లిదండ్రుల పైన సైతం పోకిరీలు తల్వార్ తో దాడి చేశారు. ప్రవీణ్ అనే యువకుడు యువతి తండ్రి గొంతు కోశాడు. అడ్డువచ్చిన యువతి తల్లిపై తల్వార్ తో దాడి చేసి గాయపరిచాడు. అంతటితో ఆగని పోకిరి గ్యాంగ్ బాధితురాలి కుటుంబ సభ్యులను చితకబాదారు. జరిగిన విషయాన్ని పోలీసులకు చెప్పి బాధిత కుటుంబం పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసింది. నార్సింగ్ పోలీసులు ప్రవీణ్, సురేష్ లతోపాటు ఆరుగురిని అరెస్ట్ చేసి రిమాండ్ కు పంపారు. పోలీసులు నిందితుల నుంచి నాలుగు తర్వార్లు స్వాధీనం చేసుకున్నారు. 307 సెక్షన్ తోపాటు నిర్భయ చట్టం కింద కేసు నమోదు చేశారు.

## జగన్ అక్రమాస్తుల కేసు విచారణ
# జాప్యమెందుకు?

(మొదటి పేజీ తరువాయి..)

ధర్మాసనం వ్యాఖ్యానించింది. రాజకీయ నేత, సీఎం అనే కారణాలతో విచారణలో జాప్యం జరగకూడదని జస్టిస్ సంజీవ్ ఖన్నా అన్నారు. బెయిల్ రద్దు, కేసు విచారణ తెలంగాణ నుంచి మరో రాష్ట్రానికి బదిలీ పిటిషన్లను కలిపే విచారణ చేపడతామని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. తదుపరి విచారణను ఆగస్టు 5 నుంచి ప్రారంభమయ్యే వారానికి వాయిదా వేసింది. ఏపీ సీఎం జగన్ అక్రమాస్తుల కేసులో ఆయన బెయిల్‌ను రద్దు చేయాలన్న ఎంపీ రఘురామ కృష్ణరాజు వేసిన పిటిషన్‌పై సోమవారం సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. జగన్ కేసుల విచారణలో జాప్యంపై కారణాలు తెలపాలని సీబీఐని సుప్రీం ధర్మాసనం ఆదేశించింది. రఘురామ పిటిషన్ల పై జస్టిస్ సంజీవ్ ఖన్నా నేతృత్వంలోని ధర్మాసనం విచారణ నిర్వహించింది. జగన్ కేసుల విచారణను వేరే రాష్ట్రానికి బదిలీ చేయాలని కూడా రఘురామ మరో పిటిషన్ దాఖలు చేశారు. రెండు పిటిషన్లపై జస్టిస్ సంజీవ్ ఖన్నా ధర్మాసనం విచారణ జరిపింది. రెండు పిటిషన్లపై రిప్లైకి సీఎం జగన్ మరింత సమయం కోరారు. తదుపరి విచారణ ఆగస్ట్ 5 కి వాయిదా వేసింది. నాలుగు వారాల్లో అఫిడవిట్ దాఖలు చేయాలని జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ దీపాంకర్ దత్తాల ధర్మాసనం ఆదేశించింది. బెయిల్ రద్దు, హైదరాబాద్ నుంచి ట్రయల్ మరో రాష్ట్రానికి బదిలీ పిటిషన్లను కలిపే విచారణ చేపడుతామని ధర్మాసనం స్పష్టం చేసింది. తదుపరి విచారణ ఆగస్టు 5 నుంచి ప్రారంభం అయ్యే వారానికి వాయిదా వేసింది.

# దంచికొడుతున్న ఎండలు

**- 43 డిగ్రీలు దాటిన ఉష్ణోగ్రతలు**

**నేటి ఫోకస్ న్యూస్, నల్లగొండ-ఏప్రిల్1:**

రాష్ట్రంలో ఎండలు దంచికొడుతున్నాయి. ఇప్పటికే పలు జిల్లాల్లో ఉష్ణోగ్రతలు 43 డిగ్రీల గరిష్టానికి చేరుకున్నాయి. సూర్యుడి ప్రతాపంతో ఉదయం నుంచే ఉక్కపోత మొదలవుతున్నది. పొద్దున 9 గంటలకే భానుడు భగభమంటున్నాడు. రాబోయే 5 రోజులపాటు ఉష్ణోగ్రతలు మరింత తీవ్రంగా ఉంటాయని హైదరాబాద్ వాతారణ కేంద్రం తెలిపింది. 15 జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీచేసింది. ఉత్తర తెలంగాణ జిల్లాలకు వడగాడ్పుల ముప్పు అధికంగా ఉంటుందని పేర్కొంది. నల్లగొండ జిల్లాలోని శివన్నగూడెంలో అత్యధికంగా 43.1 డిగ్రీల ఉష్ణోగ్రత రికార్డయింది. మరో రెండు రోజుల్లో ఉష్ణో గ్రతలు 44 డిగ్రీలకు చేరే అవకాశం ఉన్నట్టు అధికారులు తెలిపారు. కాగా, ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్నసిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, మహబూబ్ నగర్, నారాయణపేట, వనపర్తి, జోగులాంబ గద్వాల, నాగర్ కర్నూల్ జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీచేశారు.

## కేసీఆర్ ప్రజల్లోకి రాగానే
# నీళ్లొదిలారు..



(మొదటి పేజీ తరువాయి..)

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి వంద రోజులు గడుస్తున్నప్పటికీ రుణమాఫీ చేయలేదు. రైతుబంధు ఇవ్వలేదు.. కాంగ్రెస్ ప్రభుత్వం పై గ్రామాల్లో రైతులు కుతకుత ఉడుకుతున్నారు. రైతుబంధు అడిగితే చెప్పుతో కొట్టండి అని కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అంటడు. చెప్పుతో కొట్టమన్న ఆయన అహంకారానికి ఓటు అనే ఆయుధంతో వేటు వేయండి. రైతుబంధు దుబారా అని ఉత్తమ్ కుమార్ రెడ్డి అంటుండు. అహంకారంగా మాట్లాడే ఈ జిల్లా నాయకులకు పార్లమెంట్ ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలని కేటీఆర్ విజ్ఞప్తి చేశారు. రూ. 2 లక్షల రుణమాఫీ కావాలంటే, రూ. 15 వేల రైతుబంధు ఇవ్వాలంటే, వరి ధాన్యానికి బోనస్ రూ. 500 ఇవ్వాలంటే బీఆర్ఎస్‌కు ఓటేయాలి. కాంగ్రెస్‌కు ఓటేస్తే.. తాము ఏవీ అమలు చేయకున్నా.. మళ్లీ మాకే ఓటేశారని తప్పించుకు తిరుగుతారు. సీఎం రేవంత్ జేబులో కత్తెర పెట్టుకుని తిరుగుతున్నా అంటుండు. తనకు తెలిసి జేబు దొంగలు తిరుగుతారు ముఖ్యమంత్రులు తిరుగరని కేటీఆర్ తెలిపారు. పేగులు కట్ చేసి మెడలో వేసుకుంటా అంటుండు. అది ముఖ్యమంత్రి చేసే పనా.. అది బోటి కొట్టేడు చేసే పని. సెక్రటేరియట్‌లో లంకె బిందెలు ఉన్నాయనుకున్నా.. ఇక్కడ ఖాళీ బిందెలు ఉన్నాయి. అయినా లంకె బిందెల కోసం ఎవరు తిరుగుతారు.. అని కేటీఆర్ ప్రశ్నించారు. కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి వెళ్లి నితిన్ గడ్కరీ వద్ద నేనొస్తా నేనొస్తా అని అంటున్నారట. రుణమాఫీ చేయ్. 18 ఏండ్లు నిండిన ప్రతి ఆడబిడ్డకు నెలకు రూ. 2500 ఇస్తానని చెప్పావు. రైతుబంధు రూ. 15 వేలు ఇస్తా అన్నావు.. దాని కోసం రైతులు ఎదురు చూస్తున్నారు. ఆటో డ్రైవర్లు రోడ్ల మీద పడి ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి ఉంది. ఆటో డ్రైవర్లకు నెలకు రూ. 10 వేలు ఇచ్చి ఆదుకోవాలి. దమ్ముంటే ఈ పనులు చేసి చూపించు అని కేటీఆర్ సవాల్ చేశారు. పొంకనాల పోతిరెడ్డి మాటలు విని ప్రజలు మోసపోయారు. నిజం నిలకడ మీదనే తెలుస్తుంది. ఇదే తెలంగాణ ప్రజలు ప్రేమతో, దయతో పదేండ్లు బీఆర్ఎస్‌కు అవకాశం ఇచ్చారు. బీఆర్ఎస్ పాలన స్వర్ణయుగాన్ని తలపించింది. ఇక బీఆర్ఎస్, బీజేపీ ఒక్కటే.. బీజేపీకి బీ టీమ్ బీఆర్ఎస్ అని రాహుల్ గాంధీ నుంచి రేవంత్ దాకా మాట్లాడారు. ఇవాళ రాహుల్ మాట్లాడుతూ.. మోదీ దొంగ అంటడు. రేవంత రెడ్డేమో మోదీ మా పెద్దన్న అని అంటుండు. అదానీ ఫ్రాడ్ అని రాహుల్ అంటుంటే.. అదానీ మా ఫ్రెండ్ అని రేవంత్ అంటుండు. లిక్కర్ స్కాం లేదు.. కేజ్రీవాల్‌ను అరెస్టు చేయడం అన్యాయం అని రాహుల్ అంటుండు. లిక్కర్ స్కాం నిజమే. కవిత అరెస్టు కరెక్ట్ అని రేవంత్ అంటుండు. గుజరాత్ ఓ ఫేక్ మోడల్ అని రాహుల్ అంటడు.. తెలంగాణను గుజరాత్ మోడల్‌లా చేస్తా అని రేవంత్ అంటున్నాడు. రేవంత్ రాహుల్ కోసమా, మోదీ కోసమా పని చేసేది. ఒక్క ఓటు కాంగ్రెస్‌కు వేసినా అది బీజేపీకి పోతుందన్నారు. పార్లమెంట్ ఎన్నికల తర్వాత ఇదే రేవంత్.. షెల్టర్, భవిష్యత్, కేసుల నుంచి బయటపడటం కోసం బీజేపీలో చేరుతారు. ఈ మాట పదిసార్లు అన్నాను. కానీ ఈ విషయంలో మాత్రం రేవంత్ స్పందించడం లేదని కేటీఆర్ పేర్కొన్నారు. కేసీఆర్ నిన్నటి పర్యటన వీడియోలు చూస్తే నల్గొండ జిల్లాలో ఎలా ఓడిపోయామో తెలియడం లేదని బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. పదేళ్ల నిజం ముందు వంద రోజుల అబద్ధాలను ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. మోసపోయినోళ్లు బీఆర్ఎస్ ఓటేయాలని.. రుణమాఫీ వచ్చినోళ్లు కాంగ్రెస్‌కు ఓటేయాలన్నారు. కరెంటు, నీళ్లు ఇవ్వక పోయినా, పంటలు ఎండినా కాంగ్రెస్‌కే ఓటు వేస్తే ఐదేళ్లు తప్పించుకుంటారన్నారు. తప్పు ప్రజలది కాదు. కేసీఆర్ మనల్ని నమ్ముకున్నాడు. కానీ బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన మంచి పనులను ప్రజల్లోకి మనం తీసుకెళ్లలేకపోయాం. అందువల్లే అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోయామని కేటీఆర్ తెలిపారు. తుంగతుర్తి, సూర్యాపేటలో కేసీఆర్ పర్యటన సందర్భంగా జనంలో ఆ ఎమోషన్ చూస్తుంటే.. అసలు నల్లగొండ జిల్లాలో బీఆర్ఎస్ పార్టీ ఎందుకు ఓడిపోయిందనేది అర్థం కాలేదు. ఓటమి గల కారణాలపై ఈ వంద పది రోజుల్లో వేల మందితో కూర్చొని మాట్లాడుకున్నాం. ఏం జరిగిందని విశ్లేషించుకున్నాం. నల్లగొండ, మిర్యాలగూడ, కోదాడ సభలకు హాజరైనప్పుడు.. ఆ జనాన్ని చూసి బీఆర్ఎస్ గెలుస్తుందని నమ్మాం. ర్యాలీలు, సభలకు వచ్చిన జనాలను, వారి ఉత్తేజాన్ని చూసిన తర్వాత నల్లగొండలో 12 లో 8 సీట్లు గెలుస్తామన్న విశ్వాసంతో ఉన్నాం. కానీ ఫలితాలు దానికి భిన్నంగా వచ్చాయన్నారు. మన మిత్రుడు భూక్యా జాన్సన్ అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోయిన తర్వాత దాదాపు 45 నియోజకవర్గాల్లో ఓయూకు చెందిన 20 మంది విద్యార్థులతో సర్వే చేయించారు. ఆ సర్వేలో ఈ విషయాలు వెలుగులోకి వచ్చాయని కేటీఆర్ తెలిపారు. మనం తప్పకుండా పార్టీ కుటుంబ సభ్యులుగా కేసీఆర్ బిడ్డలుగా ఆత్మ విమర్శ చేసుకోవాలి. మొన్న జరిగిన పొరపాట్లు పార్లమెంట్ ఎన్నికల్లో జరగకూడదు. పని చేసుకుంటూ వెళ్లిపోయాం.. కానీ ప్రభుత్వం చేసిన మంచి పనులను ప్రజల్లోకి తీసుకెళ్లలేదు. ఎందుకంటే బీఆర్ఎస్ పాలనలో ఒక లక్షా 60 వేల 283 మంది పిల్లలకు ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చాం. ఈ దేశంలో ఈ పదేండ్లలో ఏ రాష్ట్రంలో కూడా ఇన్ని ఉద్యోగాలు ఇవ్వలేదు. అంటే దేశంలోనే అత్యధికంగా ఉద్యోగాల భర్తీ చేసి కూడా వాళ్ల మనసు గెలుచుకోవడంలో విఫలమయ్యాం. కేసీఆర్ పాలనలో ఇచ్చిన 30 వేల ఉద్యోగాలు నేనే ఇచ్చానని రేవంత్ రెడ్డి ఊదరగొడుతూ ఉపన్యాసాలు ఇస్తున్నారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం వచ్చినాక ఒక్క నోటిఫికేషన్ కూడా ఇవ్వలేదు. పరీక్ష పెట్టలేదు. ఈ అబద్ధాలను ప్రజలకు, యువతకు వివరించాలి. మనం ఉద్యోగాలిచ్చి కూడా చెప్పుకోలేకపోయాం. అయితే లంబాడీ తండాల్లోని కొంతమంది నిరుద్యోగులు తమకు ఉద్యోగాలు రాలేదు చెప్పారు. పెన్షన్లకు ఆశపడి ఓటు వేయకండి.. తమకు ఉద్యోగాలు వస్తే తామే అంతకు ఎక్కువ ఇస్తామని చెప్పి వృద్ధుల కాళ్లు మొక్కి నిరుద్యోగులు ఓట్లు వేయించారు. మరి లక్షా 60 వేల ఉద్యోగాలు ఇచ్చినట్లు చెప్పడంలో విఫలమయ్యాం. ఇక గృహలక్ష్మి అనే పథకం ఎన్నికలకు ఏడాది ముందే అమలు చేసి ఉంటే.. ఓట్లు పడేవి అని విద్యార్థులు పేర్కొన్నట్లు సర్వేలో తేలినట్లు కేటీఆర్ చెప్పారు. ఛాష్ట్రంలోని ప్రభుత్వ ఉద్యోగులకు 73 శాతం జీతం పెంచిన నాయకుడు కేసీఆర్. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల కంటే ఎక్కువ జీతాలు ఇచ్చాం. కానీ ఉద్యోగులకు దూరమయ్యాం. ఒకటో తేదీన జీతం రాలేదని చెప్పి ఓట్లు వేయలేదు. కరోనాతో పాటు ఇతర సమస్యల వల్ల ఆర్థికంగా వెనుకబడ్డామని చెప్పడంలో విఫలమయ్యాం. రైతులకు కూడా దూరమయ్యాం. అలా ఏదో ఒక కారణంతో ఆయా వర్గాల ఓటర్లకు దూరమయ్యామని కేటీఆర్ తెలిపారు. ఎన్నో ఏండ్లుగా ఉన్న ఫ్లోరోసిస్ భూతాన్ని తరిమికొట్టాం. ఫ్లోరోసిస్ కాంగ్రెస్ ద్రోహమేనని ప్రజలకు చెప్పడంలో విఫలమయ్యాం. నల్లగొండ జిల్లాకు పదేండ్లలో మూడు మెడికల్ కాలేజీలు ఇచ్చామని చెప్పడం లో విఫలమయ్యాం. ఫెయిలైంది మన నాయకుడు కాదు.. తప్పు ప్రజలది కాదు. కేసీఆర్ మనల్ని నమ్ముకున్నాడు. మనమేమో ప్రజలకు చెప్పడంలో విఫలమయ్యాం. ప్రజలేమో అబద్ధాలకు మోసపోయారు. పదేండ్ల నిజం ముందు ఈ వంద రోజుల అబద్ధం ప్రజలకు ఇవాళ కనబడుతుంది. ఏ ఊరికి మన నాయకులు పోయినా ఇట్ల అయితదని అనుకోలేదు. ఇంత మోసం జరుగుతుది అనుకోలేదని. ఇవాళ ప్రజలు బాధపడుతున్నారు. కేసీఆర్ సార్ మళ్లీ నువ్వ రావాలి. నువ్వున్నప్పుడే మంచిగ బతికినం అని ఓ రైతు కన్నీరు పెట్టుకున్న వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది. కాంగ్రెస్ పాలన ప్రజలకు అర్థమైంది.. మనకు అర్థం కావాలి. మనం గట్టిగా పని చేస్తే ఫలితం వస్తుంది. 2018లో జిల్లా మొత్తంలో 12కి 11 గెలిచాం. నల్లగొండ పార్లమెంట్‌లో 6 గెలిచాం. కానీ పార్లమెంట్ ఎన్నికల్లో నల్లగొండ, భువనగిరి స్థానాల్లో ఓడిపోయాం. ఇప్పుడు 11 సీట్లు గెలిచిన కాంగ్రెస్ పార్టీ ఈ రెండు ఎంపీ నియోజకవర్గాల్లో ఎందుకు ఓడదో

ఆలోచించి పని చేయండి. బీజేపీ, కాంగ్రెస్ రాజకీయాలను ప్రజలను సునిశితంగా గమనిస్తున్నారు అని కేటీఆర్ తెలిపారు.

## కేసీఆర్‌వి దిగజారుడు
# రాజకీయాలు

(మొదటి పేజీ తరువాయి..)

దూరంగా ఉండటం వల్ల థర్మల్ ప్లాంటుకు బొగ్గు సరఫరా కోసం భారీగా ఖర్చువుతోంది. పర్యావరణ అనుమతులు పొందటంలో ఆలస్యం వల్ల నిర్మాణ వ్యయం భారీగా పెరిగింది. తెలంగాణకు 4 వేల మెగావాట్ల విద్యుత్ ఇవ్వాలని విభజన చట్టంలోనే ఉంది. విభజన చట్టం ప్రకారమే రాష్ట్రానికి ఎన్టీపీసీ మంజూరయ్యింది. సూపర్ క్రిటికల్ టెక్నాలజీతో భద్రాద్రి ఎ÷-లాంట్ నిర్మించాల్సి ఉంది. కానీ, కమిషన్ల కోసం సబ్ క్రిటికల్ టెక్నాలజీతో భద్రాద్రి పవన్ ప్లాంట్ చేపట్టారు. రాష్ట్రంలో రికార్డు స్థాయిలో విద్యుత్ వినియోగం జరుగుతోంది. గతంలో ఎన్నడూ లేనంతగా నమోదైంది. సరఫరా లేకుంటే ఇంత వినియోగం ఎలా జరిగిందని ప్రశ్నించారు. ఏప్రిల్, మే నెలలోనూ సరిపడా విద్యుత్ ఇచ్చేలా ప్రణాళికలు రూపొందించాం. దేశమంతా గ్రిడ్ అనుసంధానం 2013లోనే యూపీఏ ప్రభుత్వం చేసింది. పదేళ్లలో పాలనలో కేసీఆర్ ఎన్ని హామీలు నెరవేర్చారో చెప్పాలి. అందరికీ రెండు పడకగదుల ఇళ్లు నిర్మించి ఇచ్చారా?ప్రతి మండలంలో బాలబాలికలకు ఇంగ్లిష్ మీడియం స్కూళ్లు, ప్రతి నియోజకవర్గంలో కేజీ టూ పీజీ విద్యాలయాలు నిర్మించారా? దళితులకు మూడెకరాల భూమి పంపిణీ చేశారా? రైతులకు రుణమాఫీ ఐదేళ్లలో పూర్తి చేశారా? వర్షాకాలంలో అధికారంలో ఉన్నది ఎవరు? వాననీటిని రిజర్వాయర్లలో నింపే పరిస్థితి లేకుండా చేసిందెవరు? ప్రపంచంలోనే అత్యద్భుతం అని చెప్పిన కాళేశ్వరం కుంగిపోయింది. అన్ని లెక్కలతో చర్చకు రావడానికి నేను సిద్ధం అని భట్టి విక్రమార్క సవాల్ విసిరారు. అంతేగాకుండా తెలంగాణ ప్రజలపై మాజీ సీఎం కేసీఆర్ మోయలేని భారం మోపారని భట్టివిక్రమార్క అన్నారు. కేసీఆర్ చెప్పేవన్నీ కట్టు కథలేనని అన్నారు. ఇంగిత జ్ఞానం లేకుండా ప్రజలను కేసీఆర్ పక్కదారి పట్టిస్తున్నారని ధ్వజమెత్తారు. నాలుగు వేల మెగావాట్ల పవర్ తెలంగాణకు ఇవ్వాలని విభజన చట్టంలోనే ఉందని చెప్పారు. 2400 మెగావాట్ల పీపీఏ అగ్రిమెంట్లు చేసుకోకుండా కేసీఆర్ కుట్ర చేశారని మండిపడ్డారు. ఆయన పాపం వల్లే ఎన్టీపీసీ రాష్ట్రానికి రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కొందరు నేతలు లాభం కోసం కాలం చెల్లిన టెక్నాలజీతో భద్రాద్రి పవర్ ప్లాంట్ ఏర్పాటు చేశారన్నారు. ఎన్టీపీసీ వల్ల కరెంట్ యూనిట్‌కు 9 రూపాయలు ఖర్చు అవుతుందని చెప్పారు. ఆ సంస్థకు లక్ష పదివేల కోట్ల రూపాయలను గత కేసీఆర్ ప్రభుత్వం బకాయిలు పెట్టిందని మండిపడ్డారు. రాష్ట్ర ప్రయోజనాల కోసమే ఢిల్లీ పర్యటనకు వస్తున్నామని చెప్పారు. గతంలో పెండింగ్‌లో ఉన్న అంశాలను పూర్తి చేశామని గుర్తుచేశారు. కేసీఆర్ లాగా ప్రధానమంత్రి కలవడానికి పది రోజులు ఇక్కడే ఉండి కుట్రలు చేయలేదన్నారు. తాము ఇతరులతో చర్చలు జరపలేదన్నారు. ఎన్నికల ముందు ఓట్ల కోసం కాల్వల్లోకి కేసీఆర్ నీరు వదిలారన్నారు. ఇప్పటికే తాము ఎలాంటి ఇబ్బంది లేకుండా నీటిని, కరెంట్‌ను అందిస్తున్నామని చెప్పారు. రాష్ట్ర అభివృద్ధి కోసం ప్రణాళికలు రూపొందిస్తున్నామని అన్నారు. 2019 లో గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఒక్కసారి మాత్రమే మొదటి నెల ఉద్యోగులకు జీతాలు ఇచ్చిందని... తాము వచ్చిన తర్వాత ప్రతినెల ఒకటో తేదీన జీతాలు ఇచ్చామని చెప్పారు. రూ. 40 వేల కోట్ల పెండింగ్ బిల్లులను పెడితే అవి కూడా ఇచ్చుకుంటూ వచ్చామన్నారు. రూ. 500 గ్యాస్ సిలిండర్, 200 ఉచిత విద్యుత్ ఇచ్చామన్నారు. మహిళలకు వడ్డీలేని రుణాలను ఇచ్చామని చెప్పారు. 5 ఏళ్లలో మహిళలకు వడ్డీలేని లక్ష కోట్ల రుణాలు ఇవ్వాలని టార్గెట్ పెట్టుకున్నామని తెలిపారు. పంట నష్టం జరిగిన వెంటనే రైతులను ఆదుకోవాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలు ఇచ్చారన్నారు. కాంగ్రెస్ వచ్చాకే వర్షాలు రావడం లేదని కేసీఆర్ అంటున్నారని... జూన్‌లో ప్రభుత్వం బీఆర్ఎస్‌ది కాదా అని ప్రశ్నించారు.

## కేసీఆర్ పాలనలో ఇరిగేషన్ రంగం
# సర్వనాశనం

(మొదటి పేజీ తరువాయి..)

ఎక్కువ మిస్ యూజ్ చేసింది కేసీఆరే అని విమర్శించారు. పోలీసులు న్యూట్రల్‌గా ఉండాలని ఇప్పుడు కేసీఆర్ చెప్పడం హాస్యాస్పదమన్నారు. కరువు వచ్చింది బీఆర్ఎస్ పాలనలోనే అని... దాన్ని సమర్థవంతంగా డీల్ చేస్తున్నామని మంత్రి ఉత్తమ్ కుమార్ పేర్కొన్నారు.బీఆర్ఎస్ సర్కార్ హయాంలో రైతులకు పంట బీమా కల్పించలేదని.. .దేశంలో పంట బీమా కల్పించని ఏకైక సర్కార్ బీఆర్ఎస్ దేనని విమర్శించారు. వరదలు, కరువుతో పంట నష్టపోతే.. ఒకటి రెండు చోట్లకు వెళ్లి కేసీఆర్ డ్రామా చేశాడని.. ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదని దుయ్యబట్టారు. మైక్ పనిచేయకుంటే కరెంట్ పోయిందంటూ కేసీఆర్ అబద్ధాలు మాట్లాడారని.. పవర్ విషయంలో బీఆర్ఎస్ చేసిందేమీ లేదన్నారు. 24 గంటల పవర్ పాలసీని కొనసాగిస్తున్నాం.. రాష్ట్రంలో పవర్ కట్స్ లేవని స్పష్టం చేశారు.కాళేశ్వరం గురించి మాట్లాడటానికి కేసీఆర్‌కు సిగ్గుండాలి. తలదించుకోవాలి.. ముందు తెలంగాణ ప్రజలకు క్షమాపణ చెప్పాలన్నారు. కాళేశ్వరంలో కమిషన్ల కోసం అంచనాలు పెంచారని చెప్పారు. కృష్ణా ప్రాజెక్టులను కేఆర్ఎంబీకి అప్పజెప్పిందే కేసీఆర్ అని నిప్పులు చెరిగారు. కేసీఆర్, జగన్ దోస్తీతో తెలంగాణకు అన్యాయం జరిగిందని.. కృష్ణా నుంచి జగన్ అక్రమంగా నీళ్లను తరలిస్తున్నా కేసీఆర్ నోరు మెదపలేదని ఉత్తమ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉమ్మడి రాష్ట్రంలో కంటే కేసీఆర్ హయాంలోనే ఏపీకి ఎక్కువ నీళ్లు తరలి వెళ్లాయన్నారు. కేసీఆర్ భయాందోళనలో ఉన్నాడు.. అందుకే పొలం బాట పట్టారని చెప్పారు. కేసీఆర్ పొంకనాలకు పోయి పార్టీని నాశనం చేశాడని విమర్శించారు. బీఆర్ఎస్ పదేళ్లలోనే కుప్పకూలిందని.. పార్లమెంట్ ఎన్నికల తర్వాత రాష్ట్రంలో బీఆర్ఎస్ కనుమరుగవుతుందని మంత్రి ఉత్తమ్ చెప్పారు. ఇన్ని మాటలు మాట్లాడుతున్న కెసిఆర్ బిఆర్ఎస్ ప్రభుత్వంలో రైతులకు పంట బీమా ఎందుకు కల్పించలేదని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అడిగారు. దేశంలో పంట బీమా కల్పించని ఏకైక ప్రభుత్వం బిఆర్ఎస్సేనని ధ్వజమెత్తారు. పార్లమెంటు ఎన్నికల తరువాత బిఆర్ఎస్ కనుమరుగుకావడం ఖాయమని జోస్యం చెప్పారు. 24 గంటల పవర్ పాలసీ కొనసాగిస్తున్నామని, నిమిషం పవర్ కట్స్ ఎక్కడా లేవన్నారు. తెలంగాణ రైతాంగం, ఇరిగేషన్‌ను సర్వనాశనం చేసి వ్యక్తి కెసిఆర్ అని, అందుకు ఆయన సిగ్గుపడాలి, తలదించుకోవాలి, తెలంగాణ జనాలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఇరిగేషన్ రంగాన్ని కెసిఆర్ నాశనం చేయడంతో పాటు దోపిడీ చేశారని ఆరోపణలు చేశారు. కాళేశ్వరం గురించి మాట్లాడేందుకు కెసిఆర్‌కు సిగ్గుండాలని, కాళేశ్వరంలో కమిషన్ల కోసం అంచనాలు పెంచారని, కళ్ల ముందే కాళేశ్వరం కుంగినా మాట్లాడటం మూర్ఖత్వం కిందకు వస్తుందని ఉత్తమ్ ధ్వజమెత్తారు. కేసీఆర్ మాట్లాడిన ప్రతి మాట అబద్ధమే అని.. ఆయన డిప్రెషన్, ఫ్రస్టేషన్‌లో ఉన్నారంటూ వ్యాఖ్యలు చేశారు. కేసీఆర్, ఆయన కుటుంబసభ్యులు తప్ప బీఆర్ఎస్‌లో ఎవరూ మిగలరన్నారు. పదేండ్లలో పంట నష్టం జరిగితే కేసీఆర్ రూపాయి కూడా ఇవ్వలేదని గుర్తుచేశారు. ఇరిగేషన్‌పై మాట్లాడే అర్హత కేసీఆర్‌కు లేదన్నారు. ప్రాజెక్టులను కేఆర్ఎంబీకి అప్పచెప్తామని బీఆర్ఎస్ చీఫ్ ఒప్పుకున్నారని గుర్తుచేశారు. కేసీఆర్ - జగన్ కలిసి ఉమ్మడి నల్గొండ, ఖమ్మం జిల్లాలపై కుట్ర చేశారని ఆరోపించారు.

# పక్కా ప్రణాళికతో తాగునీటి సరఫరా

- తాగునీటి సరఫరా పరిశీలనకు ప్రత్యేక అధికారుల నియామకం
- నాణ్యమైన ధాన్యాన్ని పూర్తి స్థాయిలో మద్దతు ధరపై కోనుగోలు
- పాఠశాలలో మౌలిక వసతుల పనులు అమ్మ ఆదర్శ కమిటీ ద్వారా పూర్తి చేయాలి
- ఉష్ణోగ్రతలు పెరుగుతున్న నేపథ్యంలో వడ దెబ్బల నియంత్రణ చర్యలు చేపట్టాలి..
- తాగునీటి సరఫరా, ధాన్యం కొనుగోలు, పాఠశాల మౌలిక వసతుల కల్పన పై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి






**మహబూబాబాద్, (నేటి ఫోకస్‌న్యూస్)-ఏప్రిల్ 01:** రానున్న 2 నెలల పాటు పక్కా ప్రణాళికతో త్రాగునీటి సరఫరా చేపట్టాలని,ప్రజలకు ఎక్కడ ఎలాంటి ఇబ్బందులు రాకుండా జాగ్రత్తలు వహించాలని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి హైదరాబాద్‌లోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సచివాలయం నుంచి రాష్ట్ర స్థాయి ఉన్నతాధికారులతో కలిసి వేసవి త్రాగునీటి సరఫరా ప్రణాళిక,ధాన్యం కొనుగోలు, పాఠశాల మౌలిక వసతుల కల్పనపై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సమీకృత జిల్లా కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ అద్వైత్ కుమార్ సింగ్, ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ కార్యదర్శి శాంతి కుమారి మాట్లాడుతూ వేసవి కాలంలో త్రాగునీటి సరఫరా పై అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేసుకుని సన్నద్ధంగా ఉన్నామని, ప్రతి రోజు త్రాగునీటి సరఫరాను పర్యవేక్షించాలని ప్రజలకు ఎక్కడ ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూడాలన్నారు. తాగునీటి సరఫరా నిమిత్తం మిషన్ భగీరథ ద్వారా అందుబాటులో ఉన్న వ్యవస్థను పూర్తి స్థాయిలో వినియోగించుకోవాలని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా సజావుగా త్రాగునీటి సరఫరా చేసేందుకు అవసరమైన పనులు పూర్తి చేయాలని అన్నారు. త్రాగునీటి సరఫరాను పర్యవేక్షించేందుకు మండల స్థాయిలో , గ్రామస్థాయిలో ప్రత్యేక అధికారులను నియమించాలని సి ఎస్ కలెక్టర్లకు సూచించారు. మిషన్ భగీరథ వ్యవస్థ, స్థానికంగా అందుబాటులో ఉన్న నీటి వనరులతో రూపొందించిన ప్రత్యామ్నాయ వ్యవస్థలను వినియోగించుకుంటూ గ్రామస్థాయిలో రానున్న రెండు నెలలకు త్రాగునీటి సరఫరా కార్యాచరణ రూపొందించుకోవాలని సీఎస్ సూచించారు. అత్యవసర పరిస్థితులలో స్థానికంగా ఉన్న వ్యవసాయ మోటార్లను వినియోగించుకోవాలని సిఎస్ అధికారులకు సూచించారు. పట్టణాలలో గ్రామాలలో త్రాగునీటి సరఫరా ఇబ్బందులు ఉన్న ప్రాంతాలకు ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేయాలని సిఎస్ పేర్కొన్నారు. రానున్న రెండు నెలల పాటు క్షేత్రస్థాయిలో త్రాగునీటి సరఫరా లో ఉత్పన్నమయ్యే సమస్యలను వెంటనే గుర్తించి వాటిని సత్వరం పరిష్కారం అయ్యే విధంగా చూడాలని, త్రాగునీటి సరఫరా ను ప్రతిరోజు పర్యవేక్షించాలని సీఎస్ పేర్కొన్నారు. ఎండ తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో భూగర్భ జలాలు తగ్గిపోతున్నాయని, పట్టణాలు , నగరాలలో, గ్రామీణ ప్రాంతాలలో సైతం ట్యాంకర్లకు డిమాండ్ పెరిగే అవకాశం ఉందని, ట్యాంకర్ బుక్ చేసిన వెంటనే సకాలంలో సరఫరా చేసే విధంగా అవసరమైన ఏర్పాట్లు చేయాలని సీఎస్ సూచించారు. రాష్ట్ర వ్యాప్తంగా వరి కోతలు జరుగుతున్న నేపథ్యంలో అవసరమైన మేర ధాన్యం కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలని, కొనుగోలు కేంద్రం లేని కారణంగా రైతులు ప్రైవేట్ కు తక్కువ ధరకు ధాన్యం విక్రయిస్తున్నారనే మాట రావద్దని సీఎస్ స్పష్టం చేశారు. రాబోయే 4 రోజుల్లో 7149 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలని అన్నారు. నాణ్యమైన ధాన్యాన్ని చివరి గింజ వరకు మద్దతు ధరపై కొనుగోలు చేయడం జరుగుతుందని, ఈ అంశంపై రైతులకు విస్తృతంగా అవగాహన కల్పించాలని అన్నారు. గ్రేడ్ ఏ రకం ధాన్యానికి 2203/- , సాధారణ రకం ధాన్యానికి 2183/- మద్దతు ధర చెల్లించడం జరుగుతుందని అన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలలో రైతుల వద్ద నుంచి మాత్రమే ధాన్యం కొనుగోలు చేయాలని, ఇతర రాష్ట్రాల నుంచి ధాన్యం రాకుండా చెక్ పోస్టులను అప్రమత్తం చేయాలని అన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలలో అవసరమైన మౌలిక వసతులు కల్పించాలని, ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకొని త్రాగునీటి సరఫరా ,టెంట్లు వంటి ఏర్పాట్లు చేయాలని సి ఎస్ అన్నారు. జిల్లాలో వరి సాగు చేస్తున్న రైతులకు సమీపంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలకు ట్యాగింగ్ చేయాలని, ప్రణాళిక బద్ధంగా కొనుగోలు కేంద్రం వద్దకు రైతు ధాన్యం తెచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. వానాకాలం 2023-24 కు సంబంధించి సీఎంఆర్ రా రైస్ డెలివరీ వేగవంతం చేయాల్సిన అవసరం ఉందని, భారత ఆహార సంస్థ నిర్దేశించిన సమయానికి రైస్ డెలివరీ చేసే విధంగా ప్రతి జిల్లాలో రైస్ మిల్లుల పనితీరును ఉన్నతాధికారులు పర్యవేక్షించాలని, ప్రతిరోజు రైస్ మిల్లులు పూర్తిస్థాయి సామర్థ్యంతో నడిచేలా చూడాలని, సి.ఎం.ఆర్, రా రైస్ డెలివరీ పై కలెక్టర్లు ప్రత్యేక శ్రద్ధ వహించాల్సి ఉంటుందని సిఎస్ పేర్కొన్నారు. జిల్లాలో ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో త్రాగునీటి సౌకర్యం, నిరుపయోగంగా ఉన్న టాయిలెట్లను ఉపయోగంలోకి తీసుకుని రావడం, అదనపు టాయిలెట్ల నిర్మాణం, తరగతి గదుల మైనర్, మేజర్ మరమ్మత్తులు తరగతి గదులకు విద్యుత్ సౌకర్యం కల్పన వంటి పనులు వేగవంతంగా పూర్తి చేయాలని అన్నారు. పాఠశాలలో మౌలిక వస్తువుల కల్పనకు ప్రతి మండలంలో పనుల పర్యవేక్షణకు ఎగ్జిక్యూటివ్ ఏజెన్సీ నియమించాలని క్షేత్రస్థాయిలో మరో సారి పాఠశాలలను తనిఖీ చేసి పక్కగా ప్రతిపాదనలు రూపొందించాలని సీఎస్ అన్నారు. ప్రతి మండల స్థాయిలో పాఠశాల మౌలిక వసతుల కల్పన పై సంబంధిత ఇంజనీరింగ్ అధికారులు ,ఎంపీడీవో , పాఠశాల నిర్వహణ కమిటీ లో ఉన్న స్వశక్తి మహిళా సంఘాల తో వర్క్ షాప్ ఏర్పాటు చేయాలని అన్నారు. పాఠశాలలో మౌలిక వసతుల కల్పన కోసం అవసరమైన నిధులను ప్రభుత్వం అందిస్తుందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని , ప్రతి పాఠశాలలో అవసరమైన పనులు పాఠశాలలు ప్రారంభం అయ్యే ముందే పూర్తి చేయాలని సీఎస్ సూచించారు.

ఎండల తీవ్రత రోజు రోజుకు కు పెరుగుతున్న నేపథ్యంలో జిల్లా స్థాయిలో వడ దెబ్బల వల్ల ప్రజలు ఇబ్బందులకు గురికాకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని, ఇప్పటికే ఉష్ణోగ్రతలు 45 డిగ్రీలు నమోదు అవుతున్నాయని, ఏప్రిల్, మే నెలలో ఇదే స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని సిఎస్ తెలిపారు. వడదెబ్బ తగిలిన వారికి అవసరమైన ప్రథమ చికిత్స సత్వరమే అందేలా చూడాలని, క్షేత్రస్థాయిలో పని చేసే సిబ్బందికి ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందించాలని, ఉపాధి హామీ పనులను ఉదయం పూట నిర్వహించాలని, ఉపాధి హామీ పనుల నిర్వహణ సమయంలో కార్మికులకు అవసరమైన మీరు ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందించాలని అన్నారు. వడ గాల్పులు వీస్తున్న నేపథ్యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విస్తృతంగా ప్రచారం కల్పించాలని, అత్యవసరం ఉంటేనే ప్రజలు బయటకు రావాలని, బయటకు వస్తే అవసరమైన జాగ్రత్తలు పాటించాలని, వడ గాల్పులు గురైన వ్యక్తులకు వెంటనే అవసరమైన ప్రథమ చికిత్స చేసి సమీప ఆసుపత్రికి తీసుకుని వెళ్లాలని అన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ అనంతరం సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్, అద్వైత్ కుమార్ సింగ్ సమావేశం నిర్వహించి జిల్లాలో తీసుకోవాల్సిన చర్యలపై తగు సూచనలు సలహాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు స్థానిక సంస్థలు, రెవెన్యూ , లెనిన్ వత్సల్ టోప్పో, డేవిడ్, డీఈఓ రామారావు, డీ.ఎం.హెచ్.డాక్టర్ కళావతి బాయి, డిపిఓ హరి ప్రసాద్, జెడ్పీ సీఈవో రమాదేవి, డిఎస్ఓ రాజేందర్, డిఎం కృష్ణవేణి, డిసిఓ వెంకటేశ్వర్లు, జిల్లా అధికారులు సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.



## వణ్యప్రాణుల వేటకు పన్నాగం

- అటవీ శాఖ అదుపులో వేటగాళ్లు
- ఇద్దరిపై కేసు నమోదు, రిమాండ్‌కు తరలింపు

**ఉమ్మడి మహబూబ్నగర్ ప్రతినిధి, (నేటి ఫోకస్‌న్యూస్) -చారకొండ వెంకటేష్ ఏప్రిల్ 01:** నల్లమల్ల అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ ఫారెస్ట్ లో ఇద్దరు వేటగాళు పుణ్యప్రాణులను అంతమొందించడానికి పకడ్బందీ ప్రణాళికలు వేస్తూన్న సందర్భంలో అటవీశాఖ అధికారులకు పట్టుబడ్డ సంఘటన చోటుచేసుకుంది. అమ్రాబాద్ మండలం మన్ననూర్ రేంజ్ అటవీ ప్రాంతంలో సోమవారం యు పాయింట్ సమీపంలో అచ్చంపేట మండలం బాణాల గ్రామానికి చెందిన రాత్రావత్ బిక్య, రామావత్ బాల్యలు కలిసి వన్యప్రాణులను వేటాడి చంపడానికి ఉచ్చులు బిగిస్తుండగా అటవీశాఖ అధికారులు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్న సందర్భంలో పట్టుబడ్డారు. ఆ ఇద్దరిని అటవీశాఖ అధికారులు అదుపులోకి తీసుకొని ఇద్దరిపై కేసు నమోదు చేయడం జరిగిందని తెలిపారు. రిమాండ్‌కు తరలించామన్నారు. అంతటితో ఆగకుండా నల్లమల్లలో ఉన్న విలువైన టేకు వృక్షాలను నీలమట్టం చేసి తరలించేందుకు ప్రయత్నాలు చేస్తున్న సందర్భంలో అటవీ శాఖ అధికారులకు పట్టుబడ్డారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ డ్రైవ్ డివైఆర్ఓ రవికుమార్, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్‌లు మధుసూదన్, ఆనంద్ కుమార్ బేస్ క్యాంప్ వాచెస్, ఫైర్ వాచెర్ ప్రొడక్షన్స్ సిబ్బంది పాల్గొన్నారు.



## ప్రభుత్వ ఉపాధ్యాయుడు మృతి

**తొర్రూర్, (నేటి ఫోకస్‌న్యూస్)-ఏప్రిల్ 01:** అనారోగ్యంతో ప్రభుత్వ ఉపాధ్యాయుడు ధరావత్ దేవేందర్ (52) మృతి చెందిన ఘటన డివిజన్ కేంద్రంలో ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం తొర్రూరు మున్సిపాలిటీ పరిధిలోని 5వ వార్డులోని దుబ్బ తండాకు చెందిన దేవేందర్ ప్రస్తుతం దంతాలపల్లి గిరిజన ఆశ్రమ పాఠశాలలో ఎస్ జిటి ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నాడు. గత కొంతకాలం క్రితం నుంచి అనారోగ్య సమస్యలతో బాధపడుతూ హైదరాబాదులోని యశోద హాస్పిటల్ లో చికిత్స పొందారు. అనంతరం కొంత మేరకు ఆరోగ్యం కుదుటపడగా కుటుంబ సభ్యులు ఇంటికి తీసుకొచ్చారు. ఆదివారం రాత్రి 11 గంటల సమయంలో గుండెపోటు రావడంతో ఆసుపత్రికి తరలిద్దామనుకునే సమయంలో మృతి చెందినట్లు తెలిపారు. మృతుడికి భార్య జ్యోతితోపాటు కూతురు కుందన లు ఉన్నారు. ఏటీడీఓ బి సత్యవతి, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు సోమ రాజశేఖర్, మాజీ సర్పంచ్ చాపల బాపురెడ్డి, నాయకులు ధరావత్ సోమన్న, ముదసాని సురేష్, భూక్య హేమంత్, చంటి, అశోక్, గణేష్ సందర్శించి పూలమాలవేసి నివాళులు అర్పించారు.



## రూ.151కే ఇంటికి భద్రాద్రి రాములోరి తలంబ్రాలు

**హైదరాబాద్, (నేటి ఫోకస్‌న్యూస్)-ఏప్రిల్ 01:** శ్రీరామ నవమి సందర్భంగా భద్రాచలంలో జరగబోయే శ్రీ సీతారామచంద్రుల కల్యాణోత్సవ తలంబ్రాలను భక్తులకు అందజేయాలని తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ(టీఎస్ఆర్టీసీ) యాజమాన్యం నిర్ణయించింది. గత ఏడాది మాదిరిగానే ఈ సారి కూడా తెలంగాణ దేవాదాయ శాఖ సహకారంతో రాములోరి కల్యాణ తలంబ్రాలను భక్తుల ఇళ్ల వద్దకు చేరవేసే పవిత్ర కార్యానికి శ్రీకారం చుట్టింది. ఎంతో విశిష్టత కలిగిన ఈ తలంబ్రాలు కోరుకునే భక్తులు టీఎస్ఆర్టీసీ లాజిస్టిక్స్ కేంద్రాల్లో రూ.151 చెల్లించి.. వివరాలను నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. శ్రీ సీతారామచంద్రుల కల్యాణోత్సవం అనంతరం ఈ తలంబ్రాలను భక్తులకు టీఎస్ఆర్టీసీ హోం డెలివరీ చేస్తుంది. హైదరాబాద్‌లోని బస్ భవన్‌లో సోమవారం భద్రాద్రి శ్రీ సీతారాముల కల్యాణ తలంబ్రాల బుకింగ్ పోస్టర్‌ను టీఎస్ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనర్, ఐపీఎస్ గారు ఆవిష్కరించారు. తలంబ్రాల బుకింగ్‌ను ఆయన ప్రారంభించారు. "నియమ నిష్టలతో ధాన్యాన్ని గోటితో ఒలిచి తీసిన కోటి బియ్యం గింజలను తలంబ్రాలుగా ఎన్నో ఏళ్లుగా రాములోరి కల్యాణంలో ఉపయోగిస్తున్నారు. విశిష్టమైన ఈ తలంబ్రాలను భక్తుల ఇంటికి చేర్చాలని రెండేళ్ల క్రితమే టీఎస్ఆర్టీసీ యాజమాన్యం నిర్ణయించింది. ఈ ప్రయత్నానికి భక్తుల నుంచి మంచి స్పందన వచ్చింది. సంస్థపై ఉన్న విశ్వాసంతో భక్తులు భారీ సంఖ్యలో తలంబ్రాలను బుక్ చేసుకుంటున్నారు. 2022లో దాదాపు 89 వేల మంది భక్తులకు తలంబ్రాలను బుక్ చేసుకోగా.. గత ఏడాది 1.17 లక్షల మంది భక్తులకు తలంబ్రాలను సంస్థ అందజేసింది." అని టీఎస్ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనర్, ఐపీఎస్ అన్నారు. భద్రాద్రిలో ఈ నెల 17న అంగరంగ వైభవంగా జరిగే శ్రీరామనవమి వేడుకలకు వెళ్లలేని భక్తులు ఈ సేవల్ని వినియోగించుకోవాలని టీఎస్ఆర్టీసీ కోరుతోందన్నారు. రాష్ట్రంలోని అన్ని టీఎస్ఆర్టీసీ లాజిస్టిక్స్ కౌంటర్లలో తలంబ్రాలను బుక్ చేసుకోవచ్చని చెప్పారు. సంస్థ మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్‌లు కూడా భక్తుల వద్ద నేరుగా ఆర్డర్లను స్వీకరిస్తారని తెలిపారు. తలంబ్రాల సేవను పొందాలనుకునే భక్తులు టీఎస్ఆర్టీసీ కాల్ సెంటర్ ఫోన్ నంబర్లైన 040-23450033, 040-69440000, 040-69440069 ను సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టీఎస్ఆర్టీసీ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్(సీవోవో) డాక్టర్ వి.రవిందర్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కృష్ణకాంత్, సీటీఎం శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.



## సినీ హీరోయిన్లను కేటీఆర్ బెదిరించారు

- కేసీఆర్ త్వరలో జైలు ఊచలు లెక్కిస్తారు
- మంత్రి కొండా సురేఖ

**వరంగల్, (నేటి ఫోకస్‌న్యూస్)-ఏప్రిల్ 01:** బీఆర్ఎస్ నాయకుడు కేటీఆర్ ఫోన్ టాంపరింగ్‌లో సిని హిరోయిన్లను బెదిరింపులకు పాల్పడ్డారని, త్వరలో కేసీఆర్ శ్రీకృష్ణ జన్మస్థానానికి పోయే అవకాశం ఉందని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ వ్యాఖ్యానించారు. ఎన్నికలు వచ్చాయి కాబట్టి కేసీఆర్ ఫాంహౌస్‌ను విడిచి వచ్చాడని, కొత్త డ్రామాకు తెర తీశారని విమర్శించారు. సోమవారం వరంగల్లో ఆమె మీడియా సమావేశం నిర్వహించారు. అధికారం కోల్పోవడంతో కేసీఆర్ కేటీఆర్ అసత్య ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ ని విమర్శించే హక్కు కేసీఆర్‌కు లేదన్నారు. కేసీఆర్ పాలనలో ధనిక రాష్ట్రాన్ని అప్పులపాలైందని విమర్శించారు. కేసీఆర్ బిడ్డ కవిత మద్యం కేసులో జైలులో ఉందనే విషయం మరిచిపోయారన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయంలో రైతులు ఆత్మహత్యలకు పాల్పడినా వారికి ఆర్థిక సహాయం చేయలేదని అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే 100 రోజుల్లో 5 గ్యారెంటీలను అమలు చేశామన్నారు. రైతులకు రాయితీలను ఎత్తివేసి రైతు భీమా ఇచ్చారన్నారు. ఎక్కువ ధరకు విద్యుత్ కొనుగోలు చేసి.. రాష్ట్రంను అప్పులపాలు చేశారని మండిపడ్డారు. కేసీఆర్ పాలనలో విద్యుత్ సంస్థలు అప్పులపాలైయ్యాయన్నారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ కు ఓటమి తప్పదని హెచ్చరించారు. తమ మానసపుత్రికగా చెప్పుకున్న కాళేశ్వరం ప్రాజెక్టు మీ పాలనలో దెబ్బతిందన్నారు. దెబ్బతిన్న రెండు ప్రాజెక్టుల రూపకల్పన చేసింది ఈ గొప్ప ఇంజనీర్ కేసీఆర్ గదా? అంటూ ఎద్దేవా చేశారు. నిర్మాణ లోపంతోనే కాళేశ్వరం దెబ్బతిందన్నారు. బీఆర్ఎస్ పార్టీ త్వరలో కనుమరుగవుతుందని జోస్యం చెప్పారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పై కేటీఆర్ మాట తీరు మార్చుకోవాలని సూచించారు. ఈ మీడియా సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్, కాంగ్రెస్ పార్టీలో చేరిన డాక్టర్ కడియం కావ్య పాల్గొన్నారు.

## తొర్రూర్ ఎక్సైజ్ స్పెషల్ ఆఫీసర్‌గా ఆర్.ప్రవీణ్ నియామకం

**తొర్రూర్, (నేటి ఫోకస్‌న్యూస్)-ఏప్రిల్ 01:** ఎక్సైజ్ స్పెషల్ ఆఫీసర్ గా ఆర్ ప్రవీణ్ ను నియమించినట్లు అధికారులు తెలిపారు. ఇటీవల మద్యం మాయం అనే అంశం పట్టణంలో కలకలం రేపున విషయం అందరికీ విధితమే. అయితే ఈ విషయంపై ఎక్సైజ్ ఎస్సై రవళి రెడ్డిపై హైదరాబాద్ టస్క్ ఫోర్స్ అధికారులు విచారణ చేపట్టిన విషయం అందరికీ తెలిసిందే. తాజాగా ఆ వార్తపై స్పెషల్ ఆఫీసర్ ఆర్ ప్రవీణ్ స్పందిస్తూ సోమవారం ఎక్సైజ్ కార్యాలయంలో విలేకరులతో సమావేశం నిర్వహించిన సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్సై రవళి రెడ్డిని డిసీ అటాచ్డ్ గా పంపించడం జరిగిందని తెలిపారు. రవళి రెడ్డి పై ఇంకా వారం రోజులు విచారణ జరుగుతుందని మాపై అధికారులు చర్యలు తీసుకుంటారని తెలిపారు.



## ప్రజాశాంతి పార్టీలోనే ఉంటా..

- వరంగల్ ఎంపీగా బరిలో నిలుస్తాను
- ప్రజాశాంతి పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బాబు మోహన్

**వరంగల్, (నేటి ఫోకస్‌న్యూస్)-ఏప్రిల్ 01:** తాను ప్రస్తుత పరిస్థితుల్లో ప్రజాశాంతి పార్టీని వీడి ఏ పార్టీలో చేరడం లేదని తాను పార్టీ మారుతున్నట్లు వస్తున్న ప్రచారాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు, వరంగల్ ఎంపీ అభ్యర్థి బాబు మోహన్ స్పష్టం చేశారు. వరంగల్ లో బాబు మోహన్ సోమవారం మీడియాతో మాట్లాడారు. నేను పార్టీలో చేరిన రోజే ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ నన్ను ఎంపీ అభ్యర్థిగా ఎంపిక చేశారని చెప్పారు. ప్రస్తుతం తాను తెలంగాణ రాష్ట్ర ప్రజాశాంతి పార్టీ అధ్యక్షులుగా కొనసాగుతున్నానని వివరించారు. నేను పుట్టింది, పెరిగింది నా బాల్యమంతా వరంగల్లోనే తనకు ఈ జిల్లాతో మంచి అనుబంధం ఉందన్నారు. నేను ప్రజాశాంతి పార్టీలోనే ఉన్నాను. ప్రజా ప్రశాంతి పార్టీ లోనే పోటీ చేస్తానని స్పష్టం చేశారు. పార్టీ మారుతున్నట్లు వదంతులు పుట్టించకూడదని విన్నవించారు. తన రాజకీయ ప్రయాణం పై చీప్ పాలిటిక్స్ చేయొద్దని విజ్ఞప్తి చేశారు. వరంగల్ ప్రజలకు సేవలు అందించేందుకు మీ ముందుకు వస్తున్నానని చెప్పారు. 25 సంవత్సరాలుగా పాలిటిక్స్ లో ఉన్నాను ఏక్కడ అబద్ధం ఆడలేదన్నారు. బిజెపికి వెట్టి చాకిరి చేశాను, ఎంతో మందికి సభలు నిర్వహించానని తెలిపారు. నాకు ఫెయిర్ బాబు మోహన్ అనే పేరు ఉందన్నారు. పేద విద్యార్థులకు ఉచిత హాస్టల్లు, విద్య కేఏ పాల్ అందిస్తున్నారని అందుకే ప్రజాశాంతి పార్టీలో చేరినట్లు బాబు మోహన్ వివరించారు.



## ఉదయరాణి కుటుంబ సభ్యులను ఓదార్చిన ఎమ్మెల్యే మాధవరం



**ఫోకస్ న్యూస్, కంటోన్మెంట్ ఓల్డ్ బోయిన్ పల్లి:** ఓల్డ్ బోయిన్ పల్లి డివిజన్ కు చెందిన బి.ఆర్.ఎస్ పార్టీ సీనియర్ నాయకురాలు ఉదయా రాణి నాన్న స్వర్గస్తులయ్యారని, విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, డివిజన్ కార్పొరేటర్ ముద్దం నరసింహ యాదవ్ లు హాజరై పార్థవదేహానికి పూలమాలలు వేసి, వారి కుటుంబ సభ్యులకు మనోధైర్యాన్ని కల్పించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ డివిజన్ సీనియర్ నాయకులు కర్రె జంగయ్య, మేకల హరినాథ్, బుర్రి యాదగిరి, బాలరాజు హాజరై కుటుంబ సభ్యులకు సంతాపం తెలిపారు.

నేటి ఫోకస్ న్యూస్
అను నిత్యం...ప్రజా పక్షం...
మంగళవారం 02, ఏప్రిల్ 2024

# కెరీర్‌లో ఎన్నో ఆటుపోట్లు ఎదుర్కొన్నా..: చిరంజీవి..



తెలుగు డిజిటల్ మీడియా ఫెడరేషన్ వేడుకలు హైదరాబాద్‌లో జరిగాయి. ఈ కార్యక్రమంలో మెగాస్టార్ చిరంజీవి నటుడు విజయ్ దేవరకొండ గెస్ట్‌లుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా విజయ్ దేవరకొండ చిరంజీవిని ఇంటర్వ్యూ చేశారు. కెరీర్‌లో ఆయన ఎదుర్కొన్న విమర్శలు, కుటుంబం గురించి పలు ప్రశ్నలు అడిగారు. దీనికి చిరు ఆసక్తికర జవాబిచ్చారు. కెరీర్ పరంగా ఈ స్థాయికి రావాలని ఎన్నో కలలు కన్నా. అయితే ఇప్పుడు నేను అనుభవిస్తున స్టార్‌డమ్ ఒక్కరోజులో మొదలైంది కాదు, ఒక్క రోజులో వచ్చింది కాదు. స్కూల్, కాలేజీ రోజుల్లో నాటకాలు వేసేవాడిని. అప్పట్లో బెస్ట్ యాక్టర్‌గా అవార్డు అందుకున్న రోజులున్నాయి. తోటి విద్యార్థులు నాపై ప్రశంసలు కురిపించేవారు. వారి మాటలు విని నేనెంతో గర్వపడేవాడిని. నటుడిగా మారాలనే బీజం అప్పుడే పడింది. సెలబ్రిటీ అయితే అందరూ మనల్నే చూస్తారని అర్థమైంది. దాని కోసం వచ్చిన ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటూ ముందుకు అడుగులు వేశా. నా ఎదుగుదల వెనుక కష్టంతో పాటు జయాపజయాలు, విమర్శలు ఇలా చాలానే ఉన్నాయి. అవన్నీ దాటుకుని ఇప్పుడు ఈ హోదాలో ఉన్నా. కెరీర్‌లో తొలి అడుగులు వేసే సమయంలో.. మనం రాణించగలమా? లేదా అని బిక్కుబిక్కుమని ఉంటాం. అలాంటి సమయంలో సానుకూల వాతావరణం ఉన్న చోటే ఉండాలి. నేను అప్పటికి సినిమాల్లోకి రాలేదు. మద్రాస్‌లో ఉన్నప్పుడు స్నేహితుడితో కలిసి పాండిబజార్ వెళ్లా. అక్కడి వాళ్లు నన్ను చూసి.. ఏంటి సినిమాల్లో చేయడానికి వచ్చావా? హీరో అవుతావా?అని హేళన చేశారు. వాళ్ల మాటలు విని ఎంతో బాధపడ్డా. ఆ సంఘటన తర్వాత నేను మళ్లీ అక్కడికి వెళ్లలేదు. నెగెటివిటీ ఉన్న చోటికి వెళ్తే మనం మరింత కుంగుబాటుకు గురి అవుతాం. నా కుటుం బానికి నాన్నే ఫ్యామిలీస్టార్. ఒక కుటుంబాన్ని ఎలా చూసుకోవాలనే దాన్ని ఆయన నుంచే నేర్చుకున్నా. మా అమ్మకు ఐదుగురు చెల్లెళ్లు. మా తాతయ్య చనిపోయాక.. నాన్నే వారి బాధ్యత తీసుకుని వచ్చిన జీతంలోనే వారికి పెళ్లిళ్లు చేశారు. మా కుటుంబంలో ఎవరు ఎంత ఎత్తుకు ఎదిగినా.. పలు సందర్భాల్లో అందరూ ఒకచోట కలిసేలా నేనూ సురేఖ లాన్ చేస్తుంటాం. అలా కలవడం వల్ల మనలో ఉండే చిన్న చిన్న మనస్పర్థలు తొలిగిపోతాయని మా నమ్మకం. నేను మనసుకి ఆహ్లాదానిచ్చే చిత్రాలు చూస్తుంటా. చెబితే నవ్వుతారు కానీ.. నాకు 'మిక్కీ హౌస్' కామిక్ చిత్రాలు చూస్తా. జాకీ చాన్ చిత్రాలను ఎక్కువగా చూస్తాను. ఇంట్లో వాళ్లు గదుల్లో లైట్స్ అన్ని ఆన్ చేసి వెళ్లిపోతుంటారు.






# కలెక్షన్లలో దూసుకెళ్తున్న టిల్లు స్క్వేర్..

టాలీవుడ్ యువ హీరో సిద్దు జొన్నలగడ్డ కాంపౌండ్ నుంచి వచ్చిన ప్రాజెక్ట్ డీజే టిల్లు సీక్వెల్ ప్రాజెక్ట్ టిల్లు స్క్వేర్ ఇటీవలే దిడుదలై మంచి టాక్ తెచ్చుకుంది. బాక్సాఫీస్ వద్ద మంచి వసూళ్లతో దూసుకెళ్తుంది. నరుడా డోనరుడా ఫేం మల్లిక్‌రామ్ డైరెక్ట్ చేసిన ఈ చిత్రం మార్చి 29న విడుదలై ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో సందడి చేస్తోంది. ఈ చిత్రం ఓపెనింగ్ వీకెండ్‌లో రూ.68.1 కోట్లు వసూళ్లు రాబట్టి.. రూ.50 కోట్ల క్లబ్‌లోకి ఎంటరయ్యే దిశగా వెళ్తుంది. మూడు రోజుల థియాట్రికల్ జర్నీలో కలెక్షన్ల విషయంలో నైజాం ఏరియా కీలక పాత్ర పోషించిందనే ట్రేడ్ విశ్లేషకుల అంచనా. ఆదివారం ఒక్కరోజే టిల్లు 2 నైజా ఏరియాలో రూ.3.30 కోట్లు రాబట్టింది. నైజాంలో మూవీ మొత్తం వసూళ్లు రూ.10.50 కోట్లు.. ఓ వైపు ఐపీఎల్ మేనియా కొనసాగుతున్నా ఓపెనింగ్ వీకెండ్‌లో రూ.10 కోట్ల క్లబ్‌లోకి చేరిపోయి తన స్టామినా ఏంటో మరోసారి రుజువు చేస్తున్నాడు సిద్దు జొన్నలగడ్డ. టిల్లుకు మాస్ ఆడియెన్స్ ఏ రేంజ్ లో కనెక్ట్ అయ్యారో తాజా వసూళ్లు చెప్పకనే చెబుతున్నాయి. ఈ మేనియా ఇలాగే కొనసాగితే టిల్లు 2 అతి త్వరలోనే రూ.100 కోట్ల క్లబ్‌లోకి ఎంటరవడం పక్కా అని అర్థమవుతోంది. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ బ్యానర్‌తో అసోసియేట్ అవుతూ నిర్మించిన ఈ మూవీకి రామ్ మిర్యాల సంగీతం అందించాడు. ఈ చిత్రంలో మురళీధర్ గౌడ్, ప్రణీత్ రెడ్డి ఇతర కీలక పాత్రల్లో నటించారు. క్లైమాక్స్ షాకింగ్‌గా ఉండటమే కాదు.. ప్రేక్షకులంతా స్టన్ అవడం గ్యారంటీ అని సిద్దు ముందుగా చెప్పినట్టుగానే ఆ మ్యాజిక్‌ను రిపీట్ చేసినట్టు ఇప్పటివరకు వచ్చిన టాక్ చెబుతోంది.





బాలీవుడ్‌లో ముక్కుసూటిగా మాట్లాడే నటీమణుల్లో రవీనా టాండన్ ఒకరు. తను అగ్ర నటిగా ఉన్ననాటి సమయం.. అప్పటి రాజకీయా లు.. బాలీవుడ్ సంప్రదాయాలు.. ఇలా పలు విషయాలపై తాజాగా ఓ ఛానెల్లో మాట్లాడారు. '90లలో నటీనటుల మధ్య పోటీ తీవ్రంగా ఉండే ది. సెట్లో వాతావరణ ఆహ్లాదకరంగా ఉండేది. హీరోహీరోయిన్ల నటన, అర్హ్లు, వివాదాల గురించి చెప్పుకుంటూ ఒకర్నొకరు ఆట పట్టించుకునేవారు. అంతవరకైతే ఫర్వాలేదు. కొన్నిసార్లు ఇది శృతి మించి పోయేది. తమ కెరీర్ పట్ల అభద్రతా భావం తో ఉండేవాళ్లు, ఇతరుల విజయాన్ని ఓర్వలేక పోయేవాళ్లు కొందరు ఇతరుల్ని కిందికి లాగాలని ప్రయత్నించేవాళ్లు. దానికోసం వాళ్ల బాయ్‌ఫ్రెండ్ లేదా గర్ల్‌ఫ్రెండ్‌ని ప్రయోగించేవాళ్లు. పరిశ్రమలో పోటీ ఉండటం సహజమే కానీ ఇదేం పద్ధతి? గాసిప్స్, అనవసర రాజకీయాలతో పాపులర్ కావాలనుకోవడం ఏంటి? కొన్నిసార్లు ఇలాంటి పరిస్థితి నేనూ ఎదుర్కొన్నా. అయితే నాకు తెలిసి ఉద్దేశపూర్వకంగా ఎవరితో ఇలా ప్రవర్తించలేదు. ఎవరి మనసూ గాయపరచలేదు. ఎవరినీ సినిమాలోంచి తీసేయించాలని ప్రయత్నించలేదు. నాకు తెలియకుండా అలా జరిగితే క్షమాపణ చెప్పడానికి ఇప్పటికీ సిద్ధమే' అని చెప్పుకొచ్చారు.

# కిందకి లాగాలని ప్రయత్నించే వారు ఉన్నారు..

# సల్లూభాయ్-మురుగదాస్ కాంబో విలన్‌గా విద్యుత్ జమ్వాల్

ఇండియన్ ఫిలిం ఇండస్ట్రీలో ఉన్న మోస్ట్ ని టాలెంటెడ్ డైరెక్టర్లలో టాప్‌లో ఉంటాడు ఏఆర్ మురుగదాస్ ఈ స్టార్ డైరెక్టర్ కాంపౌండ్ నుంచి సినిమా వస్తుందంటే అంచనాలు భారీగానే ఉంటాయి. ఈ స్టార్ డైరెక్టర్ బాలీవుడ్ స్టార్ హీరో సల్మాన్ ఖాన్‌తో సినిమా చేస్తున్నాడని తెలిసిందే. ఈ సినిమా పూర్తి చేసే కంటే ముందు మురుగదాస్ శివకార్తికేయన్‌తో చేస్తున్న ప్రాజెక్ట్ పూర్తి చేయాల్సి ఉంది. ఇంకా టైటిల్ ఫిక్స్ కానీ సల్లూభాయ్-మురుగదాస్ కాంబో సినిమాపై ఆసక్తికర వార్త నెట్టింట హల్ చల్ చేస్తోంది. ఈ చిత్రంలో బాలీవుడ్ స్టార్ యాక్టర్ విద్యుత్ జమ్వాల్ విలన్‌గా కనిపించబోతున్నాడట. ఒకవేళ ఈ వార్త నిజమైతే మురుగదాస్-విద్యుత్‌జమ్వాల్ కాంబోలో 12 ఏండ్ల గ్యాప్ తర్వాత రాబోతున్న రెండో సినిమా కానుంది. మరి మురుగదాస్-విద్యుత్ జమ్వాల్ కలయికలో రాబోతున్న సినిమా గురించి మేకర్స్ నుంచి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. శాండల్‌వుడ్ రుక్మిణి వసంత్ ఫేమేల్ లీడ్ రోల్‌లో నటిస్తోంది. శ్రీలక్ష్మి మూవీస్ పై ఎన్వీ ప్రసాద్ నిర్మిస్తున్నారు. ఈ చిత్రానికి కోలీవుడ్ స్టార్ కంపోజర్ అనిరుధ్ రవిచందర్ సంగీతం అందిస్తుండటంతో అంచనాలున్నాయి. గతేడాది టైగర్ 3 సినిమాతో ప్రేక్షకుల ముందుకొచ్చాడు సల్లూభాయ్.

